హరిమయము విశ్వమంతయు

హరి మయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరి మయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు....

నమ్మికొల్వ రాయి నారాయణుండౌను
నమ్మకున్న వట్టి దిమ్మె సుమ్మి
నమ్మి చెడినవారు నరులయందున లేరు
ఉన్నమాట చెప్పుచున్న మాట

ప్రియమైన విద్యార్థులారా!

దుర్లభమ్ మానుషోదేహః ప్రపంచమునందు సమస్త ప్రాణులలోన మానవదేహము దుర్లభమైనది. ఈ దేహమునకు ఇంతటి శ్రేష్ఠత, ఇంతటి విశిష్టత ఉండినప్పటికిని 'జ్ఞానేన శూన్య పశుభిస్సమాన' ఏ మానవుని సర్వ జంతు సామాన్యము నుండి వేరుపరచి తన్నధికము గావించినదో అట్టి జ్ఞానమే లేకుండిన మానవుడు పశువుతో సమానము. ఇట్టి ఉత్కృష్టమైన, పవిత్రమైన మానవజన్మ మనకు లభించియు దీనిని సక్రమమైన మార్గములో వినియోగించుకొనక మానవుడు దురాశలకు దుర్బుద్ధులకు, దురాలోచనలకు ఈ దేహమును అపవిత్రమైన మార్గములో అనుభవిస్తున్నాడు. నివృత్తి మార్గములో ప్రవర్తించవలసిన మానవుడు, నివృత్తి మార్గములో ఆనందమును అనుభవించవలసిన మానవుడు ప్రవృత్తికి లోబడి మనో ఇంద్రియములకు వశమై తన జీవితమును వ్యర్థము గావించుకొనుచున్నాడు. భోగాసక్తిని అనుభవించుటకు అనేక విధముల ప్రయత్నించుచున్నాడేగాని, యోగాసక్తిని, త్యాగాసక్తిని యేమాత్రము కూడను తాను అభివృద్ధి గావించుకొనుటకు తగినంత కృషి సల్పటము లేదు.

sri sathyasai vachanamrutam

ఆకార మానవుడుగా ఉండినంత మాత్రమున ప్రయోజనము లేదు. ఈ ఆకార మానవుని చేత జాతికి ఏమాత్రము కూడను విశిష్టత ఏర్పడదు. ఆకార మానవత్వము చేత జాతికి దివ్యమైన దైవత్వమును చేకూర్చుకొనలేదు. ఆకారముతోబాటు ఆచారవిచారములు అత్యవసరమనే సత్యమును గుర్తించటము అత్యవసరము. ఆచార విచారములే లేకుండిన మానవుడు ఆకార పుష్టినే అనుభవించగలడుగాని ఆత్మానందమును అనుభవించలేడు.

అసూయను తొలగించుకోండి

ఈనాటి మానవుడు కేవలము దేహమునే ఆధారముగను ప్రధానముగను విశ్వసించి తనయొక్క ఆధారతత్త్వమైన దివ్యత్వమును విస్మరించి మానవుడు కేవలము భౌతికమైన జీవితమును అభివృద్ధిగావించుకొనుచున్నాడు. అందువలననే లోకములో ఏమానవుడు కూడను శాంతిభద్రతలను పుష్టిగా అనుభవించటము లేదు. నిరంతరము అసంతృప్తితోనే జీవితము గడుపుచున్నాడు. ఈ అసంతృప్తి వలన రెండు విధములైన నష్టములు చేకూరుచున్నవి మానవునకు. ఈ అసంతృప్తి వలన అశాంతి ఒకటి. అశాంతి వల్ల అసుఖము మరొకటి. శాంతి లేనివానికి సుఖమనేది ఏమాత్రము ఉండదు. కనుక అసంతృప్తికి కారణం ఏమిటి? దీనికి అసూయనే మూలకారణము. ఈ అసూయ అనేది కేవలము అనాది కాలమునుండి పేరుకొన్న ఒక దుష్టగుణము. మానవుని హృదయమునందు అసూయ ఏనాడు నిర్మూలమగునో ఆనాడే మానవుడు సంతృప్తిని అందుకుంటాడు. సంతృప్తిగల మానవుడు శాంతిని అనుభవిస్తున్నాడు. ఈ అసంతృప్తికి కారణము ఏమిటి? ఈ అసూయకు కారణం ఏమిటి?

మానవుడు నిరంతరము కూడను తనకంటె ఉన్నతస్థాయి యందు ఉన్నవానిని, తనకంటె ఉన్నత సౌందర్యము కలిగిన వానిని చూడటం చేతనే తన లోపల తాను అంతటి వాడను కాలేకపోతిని కదా అనే దీంట్లో అసూయ ప్రారంభిస్తుంది. కాని దీనికి సంతృప్తి పొందవలసిన మానవుడు అసూయ క్రింద మార్చుకొనుచున్నాడు. ఈ అసూయను మనము నిర్మూలము గావించవలెనన్న తనకంటె తక్కువ స్థాయియందు ఉన్న వ్యక్తిని మనము కొంతవరకు గుర్తించినప్పుడే మనకు అసూయకు యేమాత్రము అవకాశము ఉండదు. తనకంటె తక్కువ మార్కులు తీసుకొన్న వానిని చూచినప్పుడు ఓ అతనికంటె నేనే బెటర్ అని దీనిలో కొంతవరకు

తృప్తి పొందుతాడు. అతనికంటె తక్కువ స్థాయిలో ఉండిన ఉద్యోగిని చూచినప్పుడు ఓ అతను నాకంటె తక్కువస్థాయిలో ఉన్నాడు అని తాను సంతృప్తి పడతాడు. కనుక మొట్టమొదట అసూయను నిర్మూలము గావించుకోవలెనన్న ఈ విధమైన మార్గమును మనము అవలంబించవలెను. క్రమక్రమేణా ఈ విధమైన దృష్టి ఉన్నతమైన ఉద్యోగిని చూచినప్పటికిని, ఉన్నత స్థాయి యందు ఉన్నవారిని చూచినప్పటికిని, ఉన్నతమైన మార్కులు పొందిన వానిని చూచినప్పటికి క్రమక్రమేణా దీనిని సమంగా మార్చుకొనుటకు అవకాశము ఉంటుంది. ముఖ్యముగా అధికమైన వానిని చూచినప్పటికిని, తనకంటె తక్కువ స్థాయి యందు వున్నవానిని చూచినప్పటికిని సమచిత్తమును అభివృద్ధిపరచుకొనే దివ్యమైన గుణమును అలవర్చుకోవాలి. తానును అంతటి సమచిత్తమును అభివృద్ధి పరచుకొనే దివ్యమైన గుణమును అలవర్చుకోవాలి. తానును అంతటి స్థాయికి పోవాలని ఆశించటంలో తప్పులేదుగాని ఉన్నత స్థాయి యందు ఉన్నవానిని గుర్తించి తాను అసూయ పడటం ఇది మహా తప్పు.

జంతూనాం నరజన్మ దుర్లభమ్

మానవజన్మము చాలా దుర్లభమైనది. ఇంక ఏజన్మలకు యింతటి విజ్ఞాన విచక్షణతో కూడిన తెలివితేటలు ఉండటం లేదు. ముఖ్యముగా శారీరకమునందుగాని, వైజ్ఞానికమునందుగాని, ఆధ్యాత్మికమునందుగాని పరిపూర్ణమైన వ్యాప్తిని మనము పొందవలెనన్న శరీరము పుష్టిగా ఉంటుండాలి. ఆరోగ్యమునకు ఆటపాటలు అత్యవసరము. అయితే ఈ ఆరోగ్యము కేవలము దేహమునకు మాత్రమే సంబంధించినది కాదు. దీనితోబాటు మానసిక సంబంధమైన ఆరోగ్యము అత్యవసరము. శరీర మానసిక ఆరోగ్యములు సంతుష్టిగా ఉండినప్పుడే మానవుడు తన సంకల్పమును విజయవంతముగా సాధించుకోగలడు. కాని శరీర మానసిక ఆరోగ్యములు సక్రమముగా లేనప్పుడు ఏ చిన్న కార్యమును తాను విజయవంతము గావించుకొనలేడు. కనుక ఇట్టి పరిపూర్ణమైన వికాసమునకు త్రికరణ శుద్ధి చాలా ప్రధానము. త్రికరణమనగా వాక్కు, చేతులు, మనస్సు ఈ మూడు పవిత్రమైన కరణములుగా మనము నిరూపించాలి. వేదమునందు మూడు విధమైన కాండములు ఉంటున్నాయి. కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ అని. దీనినే యోగత్రయములని కర్మయోగము, భక్తియోగము,

srisathyasaivachanamrutam

జ్ఞానయోగము అని నిరూపిస్తూ వచ్చింది.

మొట్టమొదటిది కర్మము. కర్మకు కరణములు అత్యవసరము. ఏ కర్మలు ఆచరించవలెనన్న మన కరములు చాలా ప్రధానమైనవి. మనము చేతులతో చేసే సమస్త కర్మలు పవిత్రమైనవిగను, పరోపకార సంబంధమైనవిగను, సార్థకమైనవిగను ఉండాలి. అట్టి కర్మలు ఈ చేతులు ఆచరించినప్పుడే కరములు పవిత్రమైనవిగా నిరూపిస్తాయి. ఇది మొట్టమొదటి కర్మశుద్ధి. ఈ కర్మలచేత చిత్తము కూడను శుద్ధి అవుతుంది. చిత్తస్య శుద్ధయే కర్మః. మానవుడు ఆచరించే సమస్త కర్మలవలన చిత్తశుద్ధి మనకు లభిస్తుంది. చిత్తశుద్ధి ఉండినంత మాత్రమున ప్రయోజనము లేదు. చిత్తై కాగ్రతకూడను అత్యవసరము. ఈ చిత్తైకాగ్రతకు భక్తి ఆధారము. భక్తి అనగా ఏమిటి? భగవంతునితో విభక్తము కానిదే భక్తి అని అర్థము. సర్వత్ర భగవత్ తత్త్వమనే సత్యాన్ని మనము గుర్తించినప్పుడు మన భావము భగవంతునికి మనకు ఎడబాటు సంభవించదు. ఇట్టి సర్వవ్యాపకత్వమైన, దివ్యత్వమైన భగవంతుని మనము స్మరించవలెనన్న, భజించవలెనన్న, చింతించవలెనన్న నాలుక అత్యవసరము. కనుకనే

జిహ్వేరసజ్ఞే మధుర ప్రియత్వం సత్యం హితం త్వారి పరమం పదామి
ఆవరణమేకా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి

అన్నాడు జయదేవుడు. నాలుక, పవిత్రమైన నాలుక, సార్థకమైన నాలుక, దివ్యమైన నాలుక, భవ్యమైన నాలుక ఈ నాలుక చేత ఎవరినీ బాధించే పదములు ఉపయోగించరాదు. ఎవరిని చింతింపచేసే పదములు ఉపయోగించరాదు. దీనితో సత్యమునే మనము ఉచ్చరించాలి. ప్రియమైన పదములనే మనము పలకాలి. హితమైన వాక్యములే మనము ఉచ్చరించాలి. ఈ పదములుకూడను కటువైన పదములుగా ఉంటుండరాదు. అందువలనే భగవద్గీతలో

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచయత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తపఉచ్యతే

ప్రీతిగను, హితముగను, ఉద్రేకము లేనిదిగను ఉండాలి మన వాక్కు. అప్పుడే మన నాలుక పవిత్రమైన కరణముగా ఏర్పడుతుంది. ఈ విధమైన పవిత్రమైన కరణముగా మనము ఉపయోగించుకున్నప్పుడే మన జన్మకూడను సార్థకమవుతుంది.

sri sathyasai vachanamrutam

సత్యంనాస్తి పరోధర్మః

మనకు నిజమైన ధర్మము యేమిటి? సత్యముకంటె మించిన ధర్మము మరొకటి లేదు. సత్యమేవ జయతే. సత్యమే మనకు జయిస్తుంది. ఇలాంటి సత్యమును మనము ఏనాటికిని మరువరాదు. బలిచక్రవర్తి చెప్పాడు పలికి బొంకుటకన్న పాపమున్నదా? ఒక్కతూరి మనము వాక్కు ఇచ్చిన తరువాత దానిని బొంకినవాడు మహాపాపి అని నిరూపించాడు. మనము యేదైన వాగ్దానము ఇచ్చినామంటే ఏదైనా ఒక ప్రమాణము చేసినామంటే దానిని ప్రాణము పోయినాసరే కానీ ఆ వాగ్దానము చెల్లించుకోవటానికి తగిన కృషి చెయ్యాలి. కానీ ఈనాడు అది మాత్రమే తక్కువ అయింది. ప్రపంచములో ఈనాడు ఇచ్చిన వాగ్దానము రేపటి దినము మరణిస్తున్నాది. క్షణమునకు ఎన్నో పర్యాయములు చూస్తూ బ్రతుకుతూ ఉన్నాది ఈ వాగ్దానము. ఇలాంటి వాక్కుకు ప్రాణము లేకుండా చేసుకునే వ్యక్తి living death బ్రతికి చచ్చినవానితో సమానము. కనుకనే మన వాగ్దానమునకు ప్రాణమునైనను త్యాగము చేయవచ్చుగాని వాగ్దానము మీరరాదు, మారరాదు. కనుకనే మాటకు ప్రాణము సత్యము. మన మాటకు life truth. కోటకు ప్రాణము సైన్యము. జాతికి ప్రాణము నీతి. నోటుకు ప్రాణము వాలు. మనము ప్రోమిసరీనోటు వ్రాసినామంటే దానికి ప్రాణము ఏమిటి మన signature ప్రాణము. signature లేకపోతే ఈ ప్రామిసరీనోటు యేమీ పనికిరాదు.

కనుక మాటకు ప్రాణము సత్యము కనుక మాటను ఒకనాడు ఏదైనా వదలుకున్నామంటే జీవితమంతా ఇలా వదలటముతోనే అలవాటైపోతుంది. ఈ సత్యపాలన నిమిత్తమై హరిశ్చంద్రుడు తన రాజ్యమును, తన పత్నిని, తన కుమారుని కూడను ధారపోసుకొని కట్టకడపటికి కాటికాపరియై కూడను తన జీవితమును గడుపుకున్నప్పటికి సత్యాన్ని వదలలేదు. కనుకనే సత్యహరిశ్చంద్రుని యొక్క చరిత్ర తరతరముల నుండి దిక్ దిగంతముల వరకు దేదీప్యమానముగా వెలుగుతూ వస్తాంది. అట్టి సార్థకనామమును మనము పొందాలనుకున్నప్పుడు సత్యాన్ని పాటించాలి. ఏ భగవత్ నామమైనను సత్య వాక్పాలనాయనమః , సత్యప్రచారాయనమః, సత్యస్వరూపాయనమః అను భగవంతుని నామముల లోపల భగవంతునికి సత్యము అని పేరు. సత్యమే భగవత్ స్వరూపము. Truth is God. అన్నారు. ఇలాంటి సత్యాన్ని మనము మనయొక్క వాక్కుద్వారా, జిహ్వద్వారా మనము పవిత్రము

గావించుకోవటమే ఈ రెండవ కరణము యొక్క పరిశుద్ధము.

స్వామి సన్నిధి పెన్నిధి అని గ్రహించండి

విద్యార్థులారా! ఇది పవిత్రమైన వయస్సు. సర్వవిధముల మానవత్వాన్ని వికసింపజేసే వయస్సు. దివ్యత్వమును ప్రకటింపజేసే వయస్సు. ఇట్టి వయస్సు నందే ఇట్టి పవిత్రమైన వాక్కును మనము సంరక్షించుకొనుటకు సరైన కృషి చేయాలి. మనము తాత్కాలికమైన తృప్తి నిమిత్తమై పదములు ఉపయోగపెడుతున్నామేగాని, వాగ్దానములు ఇస్తున్నామేగాని అవి శాశ్వతమైనరీతిగా మనము కాపాడుకోవటము లేదు. అందువలనే భగవద్గీత యందు

అనన్యాశ్చిన్త యన్తోమాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యేగక్షేమం వహామ్యహమ్

ఎవరైనా సరే ఏ జనాః యే జనమైనప్పటికి పరవాలేదు వాడు నన్ను నిరంతరము నన్ను స్మరిస్తూ ఉన్నప్పుడు వానియొక్క యోగక్షేమములు నేను చూసుకుంటానన్నాడు. ఈ యోగమంటే యేమిటి. మనము సంపాయించుకున్న పవిత్రమైన అవకాశము, సన్నివేశము. మీరు చూస్తున్నారు ప్రతిదినము వేలాదిమైళ్ల నుంచి కూడను, అనేక దేశములనుంచి కూడను ఎన్నోవేలు ఖర్చుపెట్టుకొని ఎంతోకాలము వ్యర్థము చేసుకొని ఇక్కడ ప్రవేశించి స్వామి ఒక్క పలుకు పలకరిస్తే చాలు ఆనందమును అనుభవించే వారు వేలకు లక్షలకు ఉంటున్నారు. కాసు ఖర్చు లేకుండా, కాలము వ్యర్థము చేయకుండా శరీరమునకు బాధలు కలుగకుండా శ్రమకలగకుండా సులభముగా స్వామి సన్నిధిని స్వామి పెన్నిధి మీకు లభించినప్పుడు మీరు దీనిని ఎంత అలక్ష్యముగా ఉపయోగపెట్టుకుంటున్నారు. ఎంత అలక్ష్యముగా మీరు అనుభవిస్తున్నారు. ఏ జన్మ జన్మాంతర సుకృతము చేతనో ఈ విధమైన అవకాశము మీకు లభించింది. ఆ లభించటమే యోగము అనుకోవాలి. ఈ జన్మది కాదు. ఎన్నియో జన్మల ఫలితముగా ఇది ఈనాడు ప్రాప్తించింది. కానీ ప్రాప్తించింది ఇదే యోగము. కాని దీనిని సంరక్షించుకోటమే క్షేమము. లభించిన దానిని మీరు పోషించుకోవటానికి తగిన కృషి చేయటం లేదు. ఇలాంటి లభించిన యోగమును సంరక్షించుకోటమే క్షేమము.

భక్త మీరా, సక్కుబాయి వీరందరు అనేక రకములుగా స్వామీ ఎన్నియో కష్టములకు

srisathyasaivachanamrutam

నష్టములకు దుఃఖములకు నిందలకు నిష్ఠూరములకు లొంగి మేము మీయొక్క అనుగ్రహమునకు పాత్రులమైనాముగాని దీనిని చక్కగా నిలబెట్టమని ప్రార్థించారు. మీరా చెప్పింది. ఓ భగవంతుడా! సముద్రములో ఉండిన ముత్యము సులభముగా చిక్కేది కాదు. ఇలాంటి అగాధమైన, అనంతమైన సముద్రమునందు ఎన్నియో కష్టములు పడి నేను ఈ ముత్యాన్ని సంపాదించుకున్నాను. సంపాదించుకోవటంలో గొప్పతనము కాదు. ఆ చేజిక్కిన ఈ ముత్యమును చేతినుంచి జారిపోకుండా కాపాడండి అన్నది. అదే యోగక్షేమము. సంపాదించుకొన్నది అదృష్టవశాత్తు లభించవచ్చు. కాని లభించిన దానిని కాపాడుకోటమే క్షేమము. ఇదియే క్షేమము. ఆధ్యాత్మికము, ఆదిభౌతికము, ఆదిదైవికము మూడింటి యందు క్షేమమే. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక క్షేమమే. కాని ఈ సత్యాన్ని మీరు గుర్తించుకునే సమయములో దీనిని గుర్తించుకొనకుండా దీనిని జారవిడచుకుంటూ ఉన్నారు.

ఇచ్చిన వాగ్దానమును మరువకండి

విద్యార్థులారా! మీరు వదలుకోటం సులభమే కాని దీనియొక్క పరిణామము, దీనియొక్క భవిష్యత్తు ఏవిధముగా మిమ్మలను బాధపెడుతుందనేది స్వామికి తెలుసుకనుకనే స్వామి పదే పదే బాధపడుతూ ఉంటాడు. అయ్యో ఈ విద్యార్థులు చిక్కిన అవకాశమును వదలుకొని భవిష్యత్తులో ఏ విధమైన బాధలకు గురి అవుతున్నారే అనే బాధ స్వామిది. ఏదో ఇక్కడ ఉండినంతవరకు మేము మాటలు చెప్పి ప్రమాణములు ఇచ్చి, వాగ్దానములు చేసి కాలమును మానవుడు గడుపుకొని ఈ కోర్సు అయిన తక్షణమే ఎక్కడకైనా పోవచ్చు ఏ రేసుకోర్సుకైనా పోవచ్చు ఏ భయము లేదనే ధైర్యముతో ధీమాతో మీరు మెలగుతున్నారు. చాలా పొరపాటు పొరపాటు. దీనియొక్క ఫలితము నేడు కాకపోయినా రేపైనా మిమ్ములను బాధిస్తుంది. ఆ బాధించకుండా చూసుకోటానికి మీరు కృషి చేయండి. ఈనాడు నవ్వుతూ నవ్వుతూ మీరు వాగ్దానాన్ని ఉల్లంఘించిపోతే రేపటి దినము యేడుస్తూ యేడుస్తూ అనుభవించవలసి వస్తుంది.

మన దేహములో ప్రధానమైన అంగము నాలుక. నాలుకే పశువా అనిపిస్తుంది. పశుపతి అనిపిస్తుంది. ఉన్నతస్థాయికి గొనిపోతుంది. అధోగతికి దించివేస్తుంది. కనుకనే నాలుకను అంత ప్రధానమైన ప్రమాణముగా నిరూపిస్తూ వచ్చింది వేదము. మనయొక్క నాలుక నుంచి

srisathyasaivachanamrutam

వచ్చిన పదములు జారవిడిస్తిమా నాలుకనే జారవిడిచిన వారమవుతాము. కనుక రెండవ కరణము నాలుక. దీనిని అతి జాగ్రత్తగా మనము కాపాడుకోవాలి. కనుక నాలుకచేత పవిత్రమైన పదములను యోచించి, విచారించి, కొంత ఆలోచించి దీనిని ఉపయోగపెట్టటం అత్యవసరము. ఏదో emotionతో excitementతో మీరు ఏవో కొన్ని విధములైన పదములు ఉపయోగ పెట్టవచ్చును. కాని దానికి Reaction, Resound and Reflection ఉండనే ఉంటుంది. కనుక మన వచనమును చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎక్కడికి వెళ్ళినప్పటికిని మనయొక్క వాక్కును సరైన రీతిగా పోషించుకోవాలి. ఎవరి హృదయాన్ని బాధ పెట్టనటువంటి పదములు ఉపయోగించుకోవాలి. కాలుజారితే కలుగదు నష్టము నాలుక జారితే నరకమురా అన్నారు. కాలు జారిపడితిమంటే ఏదో కొంచెం దెబ్బ తగులుతుంది. ఆ దెబ్బ కంటికి కనిపిస్తుంది. ఏ డాక్టరు దగ్గరకు వెళ్లినా అతనిని ప్రార్థించి బ్యాండేజి కట్టుకొని ఔషధము వేసుకొని నయము చేసుకోవచ్చు. కాని నాలుక జారితే హృదయానికి ఎక్కడ దెబ్బ తగులుతుందో కనిపించదు. ఎవ్వరును చూడలేరు. ఏ డాక్టరు కూడను దీనిని నయము గావించలేడు. నీ punshiment నీకు నయం చేస్తుంది. కనుక నీవు punshiment అనుభవించకుండా పశ్చాత్తాపమనే మందును వేసుకొని దీనిని నివారణ గావించుకో. ఏదో జరిగిపోయినది జరిగిపోయినది. దానికి పశ్చాత్తాపముతో నీవు పవిత్రమైన రీతిగా రూపొందించుకోటానికి తగిన ప్రయత్నము చేయాలి. కనుక మనము నాలుక విషయము లోపల అతిజాగ్రత్తగా మనము అనుభవించాలి.

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి

ఎవరిపైన కూడను మనము చెడుమాటలు ఇతరులతో చెప్పరాదు. ఎవరియొక్క బలహీనతలు మనము ఉచ్చరించరాదు. కారణము యేమిటి? నీకు యేమి అధికారము ఉన్నది. నీలో కావలసినన్ని దోషములు ఉంచుకొని ఇతరుల యొక్క దోషములను చూపించే అధికారము నీకు ఎక్కడ ఉంది. నీ దోషాన్ని నీవు చూసుకొని నివారించటానికి తగిన కృషి చేయి. తన కంటి లోపల పెద్ద దూలము పడి అల్లాడి పోతుంటే ప్రక్కన వున్న దోమను వీడు గుర్తింపచేస్తాడుట. నీలో కావలసినన్ని దోషములు కుళ్ళి కృశించిపోతుంటే దానిని గుర్తించుకోకుండా పరులు

srisathyasaivachanamrutam

యిట్టివారు, అట్టివారు అని నిర్ణయించే అధికారము నీకు లేదు. లేని అధికారములో నీవు ప్రవేశిస్తున్నావు కాబట్టి మహాపాపిగా రూపొందుతావు. నాకు ఈ విధమైన అధికారము ఉన్నదా లేదా అనే విచారణ చేసుకోవాలి. తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు. తన తప్పు తాను వెతుక్కునేవాడు ధన్యుడౌతాడేగాని పరుల తప్పులను వెతుకుతే వాడు Worstగా మారిపోతాడు. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. ఏ విధమైన చింతలు చేస్తాడో ఆ విధముగా చింతను తానుకూడా అనుభవిస్తాడు. నీలో నిజముగా దోషము లేకపోయినప్పటికి ఇతరుల దోషము నీవు వర్ణించటము చేత నీలో దోషము ఏర్పడిపోతున్నాది. ఒక ఉదాహరణము. నీ దగ్గర ఒక కెమేరా ఉంటున్నాది. నీ కెమేరా ఇంకొక రూపముపైన పెట్టి focus చేసి స్విచ్ వేస్తే వానియొక్క రూపమునీ కెమేరాలో పడిపోతుంది. అటులనే యీ దేహమనేది ఒక కెమేరా, నీ హృదయమనేది ఒక ఫిల్ము నీ వాక్కు అనేది స్విచ్. ఎవరి తప్పుపైన నీవు ఫోకస్ చేసి ఆ స్విచ్ ఆన్ చేస్తావో అది నీ హృదయములో ప్రింటు అయిపోతుంది. అతని దోషము నీలో వచ్చి పడిపోతుంది. అతని పాపము వచ్చి నీలో పడిపోతుంది. కనుక పరుల గురించి చెడ్డగా యోచించరాదు. అదే నిజమైన మానవత్వమునకు సరైన గుర్తు. 'పాపములన్నింటికంటె మించినది పరులను నిందించేదన్నా' అన్నారు. కేవలము నిందించటమే కాదు. హాస్యముగా కూడను పరులను ఏమాత్రము చేయకూడదు. కానీ ఒక్కొక్క సమయము లోపల కొంచెం తమాషాలు చేయవచ్చు. ఆ తమాషా కూడ అర్థవంతమైన తమాషాగా వుండాలి. సరియైన రీతిలో బుద్ధిని కుదిర్చే తమాషాగా వుంటుండాలి.

ఒక చిన్న ఉదాహరణము. మహా తెలివితేటలు కలిగినవాడు, గొప్ప మేధావి అద్భుతమైన గొప్ప విద్యావంతుడు కాకపోయినప్పటికి తనయొక్క చాకచక్యములోపల చక్కగా ప్రవర్తించేవాడు. అతనే చర్చిల్. ఇతను చిన్నప్పటి నుండి యుద్ధమంటే కత్తులు కఠారులు అంటే చాలా యిష్టము. అతనికి గొప్ప చదువులు చదవక పోయినప్పటికి అతను ఆర్మీలో ప్రవేశించాడు. తనయొక్క విశ్వాసము గాఢమైన విశ్వాసము. అలాంటి వ్యక్తి చదువు లేకపోయినప్పటికి బ్రిటన్ ప్రైమినిస్టరుగా అయిపోయాడు. అంతేకాకుండా నోబెల్ ప్రైజ్ అందుకున్నాడు. ఏ విద్యలు అతనిలో గొప్పగా లేవు. ఏ డిగ్రీ తాను పొందలేదు. General Knowledge, Common sense అత్యవసరమన్నాడు. అతనిలో ఒక విధమైన క్రమశిక్షణ ఉండేది. ఉపన్యాసము ఇవ్వాలనుకుంటే

srisathyasaivachanamrutam

తాను ఒక రూములో ప్రవేశించేవాడు. తన నిలువుటద్దము ముందుగా నిలుచునేవాడు. ప్రసంగము చేయవలసిన ఉపన్యాసమంతా నిలువుటద్దము ముందుగా ప్రసంగము చేసేవాడు. ఈ విధముగా తాను ప్రాక్టీసు చేసుకొని తన ముఖము యెట్లా, నోరు యెట్లా, తన action యెట్లా అని తాను చూసుకొని నా ముఖము ప్రసంగ సమయములో బాగా ప్రసన్నతగా ఉంది. నాయొక్క ఆకారము కూడను మంచి perfectగా ఉంటుండాది. ఆ విధముగా తాను తృప్తిపడి తదుపరి పబ్లిక్ ఉపన్యాసములో ప్రవేశించేవాడు. ఎలక్షన్ వచ్చింది ఈ ఎలక్షన్ లోపల తన విరుద్ధపార్టీని ఒక ఉపన్యాసములోపల చాలా ఖండిస్తూ వచ్చాడు. జోక్సు అంటే ఏమిటి అనే దానికోసం ఇవన్నీ చెపుతున్నాను. ఆ ఎదురుపార్టీ వారిని తన యిష్టము వచ్చినట్లుగా దులిపివేయటము వలన అందులోంచి ఒక స్త్రీ లేచింది. అతి ఉగ్రురాలై చాలా క్రోధముచేత 'చర్చిల్ shutup అంది. నిజముగా నేనే నీ భార్య అయివుంటే నీకు ఇంత విషము పాలతోనో, టీలోనో, కాఫీలోనో ఇచ్చివేసి నిన్ను చంపివేసి ఉండేదాన్ని అన్నాది. చర్చిల్ వెంటనే నేను నీ భర్తనే అయివుంటే విషము కలిపిన కాఫీని ముక్కుపట్టి నీచే త్రాగించిదును అన్నాడు. నేనే నీ భర్తనై ఉంటే అనడం ఆమెకు పెద్ద అవమానమైంది పాపం. దానితో నోరు మూసుకొని కూర్చుంది. ఇవి ఇతరుల యొక్క దోషములను అణగద్రొక్కే నిమిత్తమై వేసే జోక్సు.

మరొక సమయములోపల పబ్లిక్ ఉపన్యాసము చేస్తున్నాడు. తన speech అయిన తరువాత ఛైర్‌లో కూర్చున్నాడు. opposite party వచ్చి తన speech ఇస్తుండాది తిరిగి. అతను అస్తవ్యస్తముగా మాట్లాడుతున్నాడు. చర్చిల్ పదములు ఉపయోగపెట్టినా కూడను చక్కగా directగా మంచి సద్వినియోగపరచే పదములు ఉపయోగించేవాడు. కానీ యీ opposite leader తన యొక్క క్రోధము, ఉద్రేకము చేతను తను యేదో ఒకదానికి ఒకదానికి సంబంధము లేకుండా మాట్లాడుతూ వస్తున్నాడు. ఆ సమయములో ఛైర్‌పైన కూర్చున్నాడు చర్చిల్. కన్నులు మూసుకొని చాలా దీర్ఘముగా యోచిస్తున్నాడు. చాలా కష్టముగా ఉంటున్నాది అతని speech వినటానికి ఇతనికి. ఈ ఉపన్యాసము ముగించే ముందుగా ఆ opposite party leader చెబుతున్నాడు ఇది న్యాయమేనా నేను ఇంత గొప్ప leader ఉపన్యాసము యిస్తుంటే చర్చిల్ నిద్రపోతున్నాడు అన్నాడు. ఇతను ప్రైమినిష్టరుగా ఉండి ఈ విధముగా అగౌరము చేయవచ్చునా అన్నాడు. అప్పుడు ఒక జోక్ వేశాడు చర్చిల్ లేచి.

sri sathyasai vahini amrutam

అయ్యా! ఆ నిద్ర నాకు వచ్చిందంటే యెంతహాయిగా ఉండేవాడిని ఆ నిద్ర రాకపోవటం చేతనే నేనీ speech వినే అవస్థపడవలసి వచ్చింది అన్నాడు. అనగా ఈ పదముతో అతనికి ఏమైపోయింది నీ speech అంత అధ్వాన్నముగా ఉంటున్నాదని అర్థమైపోయింది. ఇలాంటి జోక్సు మనలో ఉన్న దోషములు మన ద్వారానే తనకు తాను తెలుసుకోవటానికి తగిన కృషి చేసేటువంటివే. తాను ఒక actionకు reactionగా అందిస్తూ వచ్చాడు. కనుక యితరులను మనము పరిహాసము చేయటమంటే directగా మనము వారిని attack చేయటము కాదు. ఇది చాలా తప్పు. కనుక నాలుకచేత మనము ఏవిధమైన దానిని మనము ఉపయోగపెట్టాలని చక్కగా నిర్ణయించుకోవాలి. మన మానవత్వము నాలుక చేతనే ఒక దివ్యమైన గౌరవమును సంపాదించుకుంటూ ఉన్నది. రెండవ కారణము నాలుక.

త్రికరణశుద్ధి

మూడవది మనస్సు. ఈ మనస్సు మీకు తెలిసినదే. చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్. ఈ మనస్సు చాలా చంచలమైనది. దృఢమైనది. ప్రమాదమైనది. ఈ మనస్సును సక్రమమైన మార్గములో పెట్టాలి. ఇది ఎప్పుడౌతుంది. మనయొక్క చేతులను, మనయొక్క వాక్కును సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడు సహజముగా మనసు కూడను సరైన స్థితికే వస్తుంది. కనుక మనస్సు, వాక్కు చేతులు ఈ మూడింటిని పరిశుద్ధము గావించుకోవటమే త్రికరణశుద్ధి. చేతులను పవిత్రము గావించుకోవటమే కర్మయోగము. వాక్కును సద్వినియోగ పరచుకోటమే భక్తి యోగము. ఈ రెండింటిని అనుసరించే విధముగా మన మనస్సును తీర్చిదిద్దుకోటమే జ్ఞానయోగము. ఇదే త్రియోగముల యొక్క స్వరూపము. ఇదియే త్రికరణ శుద్ధి. ఈ మూడు యెందుకోసము మనము శుద్ధి గావించుకోవాలి. ఎందుకోసం పవిత్రము గావించుకోవాలి. ఇక్కడ చిన్న ఉదాహరణముగా తీసుకోవచ్చు మీరు.

ప్రపంచమంతాకూడను పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము ఈ పంచభూతముల చేత చేరిఉంటున్నది. ఈ పంచభూతములు కూడను ఏ విశ్వమంతా వ్యాపించివున్నవో ఆ పంచభూతములే మనయొక్క దేహమును ధరించినాయి. కనుక ఈ పంచభూతములను పవిత్రముగావించుకునే నిమిత్తము పవిత్రమైన ప్రవృత్తులలో ప్రవేశించాలి. ఇది యెట్లనగా

srisathyasaivachanamrutam

చాలా రహస్యము ఉంటున్నాది. పృథ్వి మనకు ఏ విధముగా దేహములో కనిపిస్తున్నాది. మన చర్మము, మాంసము ఇవి పృథ్వీచేత యేర్పడినవి. జలము ఏరీతిగా ఉంటున్నాది దేహములో అనగా మూత్రము, రక్తము ఈ రెండు జలమయమైన అంశములే. ఇంక అగ్ని ఏరీతిగా మన దేహములో ఉంటున్నాది. దాహము, ఆకలి ఈ రెండింటితోనే అగ్ని ఇందులో ప్రవేశిస్తున్నాది. ఆకలి దప్పులతో ఈ అగ్ని ఉంటున్నాది. వాయువు ఏ రూపములో ఉంటున్నాదంటే కదలిక, నడక ఈ రెండింటియొక్క స్వరూపములో ఉంటున్నాది వాయువు. ఇంక ఆకాశము. ఈ ఆకాశము అనే స్వరూపము యే రీతిగా ఉంటుందంటే కామ క్రోధ లోభ మద మాత్సర్యములు ఈ అరిషడ్వర్గముల యొక్క స్వరూపమై ఈ ఆకాశము మనలో ప్రవేశించి ఉంటుండాది. కాని ఈ రహస్యాన్ని మనమెవరము గుర్తించటము లేదు మన ఆకలిదప్పులే ఈ అగ్ని యొక్క ప్రమాణము. మూత్ర, రక్తములే జలము యొక్క ప్రతిబింబము. మన చర్మ, కండరములే భూమియొక్క ప్రతిరూపము. ఈ కదలిక నడక యే గాలి యొక్క చేష్టలు. మనయొక్క గుణములే ఆకాశము యొక్క అంశములు. కనుక ఈ ఐదు మన దేహములో ఇమిడి ఉంటున్నాయి. ఈ ఐదింటిని మనము సార్థకము గావించుకోవాలి. సార్థకము గావించుకొనుటకే మానవత్వము మనకు ప్రాప్తించింది.

హరిమయము విశ్వమంతయు

విద్యార్థులారా! భగవంతుడెక్కడ అని మనము సంశయించవచ్చును సందేహించవచ్చును. హరి మయము విశ్వమంతయు. దీనికొక చిన్న ఉదాహరణము. ఈ ప్రపంచ పటములోపల ప్రపంచములో సమస్త రాజ్యములు కూడను ఇమిడి ఉంటున్నాయి. ఈ world map లోపలనే సమస్త రాజ్యములు చేరిఉంటున్నాయి. అదేవిధముగనే విష్ణువనే world map లోపల విశ్వమనే రాజ్యమంతా ఇమిడి ఉంటున్నాది. అయితే ఈ రాజ్యము లోపల పర్వతములు, నదులు, వనములు, అడవులు ఇవంతా హెచ్చు పల్లములుగా కనిపించవచ్చు. ఈ సెలయేరులు, చిరుకొండలు, హిమశిలలు, చిత్రాతి చిత్ర ప్రవాహములు ఇలాంటి హెచ్చు పల్లములంతా mapలో మనకు కనుపించవు. ప్రాపంచిక సంబంధమైన ప్రవృత్తి లోపల నీకు హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయేగాని విష్ణుస్వరూపము నందు ఈ హెచ్చు తగ్గులు యేవిధముగాను

sri sathyasai vachanamrutam

కనిపించవు. సమత్వముగా వుంటాయి. కనుకనే సమత్వమును మనము పొందాలనుకున్నప్పుడు విష్ణుత్వము మనము స్మరించాలి. దైవత్వము చేతనే సమత్వము మనకు ప్రాప్తిస్తుందిగాని మరొక మార్గములో మనకు సమత్వము ప్రాప్తించదు మనము ప్రాకృతదృష్టితో చూచినప్పుడు అన్నీభిన్నముగానే కనిపిస్తాయి. ఈనాడు మానవుడు స్వార్థము స్వార్థము. స్వార్థ దృష్టితో చూడటం చేతనే సమస్తము వేరుగా భావిస్తున్నాడు. ఏ చిన్న విషయమునందు మనము స్వార్థములోనే ప్రవేశిస్తున్నాము.

ఒక చిన్న ఉదాహరణము. మీకు క్లాసు పిల్లలందరు చేరి స్వామితో ఒక ఫొటో తీసుకున్నారనుకోండి. ఈ క్లాసుపిల్లలందరు చేరి ఒక ఏభైమంది ఉండవచ్చును. ఈ ఏభైమంది ఫొటోలు ఫొటోగ్రాఫరు ప్రింటు చేసి తీసుకువచ్చినప్పుడు తాను ఎక్కడ ఉన్నాడో ముందు చూచుకుంటాడుగాని ఏభైమంది ముఖములు చూడనే చూడడు. ఈ ఫొటోలో కూడ ఇంత స్వార్థము. తాను ఉన్నానా లేదా తాను సరిగా కనుపిస్తున్నావా లేదా ఇతరులు ఎక్కడైనా ఉండిపోనీ అనే ఇంత స్వార్థము ఉపయోగపెడుతున్నాము. ఈ చిన్న విషయము అటు ఉంచండి. మనకు 9th class results లేక 10th class results కొన్ని వేల వేలకంతా వస్తుంటాయి. Indian express లేక Hindu లోపల చూస్తే రెండు పేజీలు పూర్తి నంబర్సే ఉంటూ ఉంటాయి. నిజముగా ఆ నెంబర్సు చూసి అహా ఇంతమంది ప్యాసైనారుకదా అని ఆనందిస్తే ఎంత బాగుంటుంది. దీనిని చూడరు. నా నెంబరు ఎక్కడ ఉంది ఈ లక్షలలో కూడా తన నెంబరే చూసుకుంటూ వస్తాడు. మొట్టమొదట అందరిని చూచి ఆనందించు. తరువాత నీ నెంబరు చూడు. తప్పక నీ నెంబరు ఉంటుంది. కాని అట్లా చూడకుండా వీరంతా యేమైనా అయిపోనీ నా నెంబరు ఏడువందలు వుండాల, ఏడువందల నుండి నీవు చూచుకుంటూరా అక్కడికే పోయినావంటే నిజముగా వీడి నెంబరే కనిపించదు. కారణం ఏమిటి narrow mind. సంకుచితమైన భావాలు. ఈ సంకుచితమైన భావాలు మన విద్యార్థులలో దూరమైపోవాలి. మన భారతదేశములో ఇన్ని లక్షలమంది ప్యాసైనారని ఆనందించు. తరువాత నీ నెంబరు నీకే వచ్చేస్తుంది. ఈ విశాలమైన భావాన్ని పెంచుకోండి విద్యార్థులు. ఈనాడు భారతదేశము ఈ స్వార్థము చేతనే మునిగిపోతూ ఉంటున్నాది. ఈ స్వార్థము, స్వప్రయోజనము దూరము చేసినప్పుడే జగత్తుకూడను స్వప్రకాశముగా వెలుగుతుంది. ఈనాడు భారతదేశము

sri sathyasai vachanamrutam

చాలా బీదస్థితిలో ఉండే దేశమని అనేక దేశములంతా వర్ణిస్తున్నాయి. దీనికి కారణము ఏమిటి? దేశమంతా కూడను కేవలము క్షీణించి పోవటానికి కారణం ఏమిటి?

జీతానికి తగిన పని చెయ్యండి

విద్యార్థులారా! చక్కగా గుర్తించండి. మన కోరికలు మితిమీరిపోతున్నాయి దాని చేతనే దేశము క్షీణించి పోతున్నాది. ఆకసమునకైనా ఒక అంతు ఉంటున్నాది. హద్దు ఉంటుంది కాని మన కోరికలను హద్దే లేదు. కనుకనే మనము ఈనాడు కోరికలను అదుపులో పెట్టుకోవటానికి తగిన కృషిచెయ్యాలి. అందుకే ceiling on desires అని పెట్టి ఉండేది. ఈ రకముగా కొన్ని కోరికలు తగ్గించుకుంటూ వచ్చేటప్పటికి ఆర్థికముగా కూడను దేశము అభివృద్ధి చెందుతుంది. ఈనాడు మనము తీసుకున్న అప్పులు కూడను చెల్లించటానికి సాధ్యము కాకుండా ఉంటున్నాది. నేను అక్కడ లేనుకాని నాకు తెలుసు. ఈనాడు World Bank నుండి ఒక వ్యక్తి వచ్చాడు. అతను మన MBA పిల్లలకంతా teach చేశాడు. అతను కేవలము స్వామి చెప్పిన మాటలను అక్షరాలా పలికాడు. అతను చాలా experience ఉన్నవాడు. ఈనాడు దేశములంతా దిగజారిపోవటానికి కారణం కేవలము దురాశలే. అనేక దేశములంతా ఈ World Bank నుండి అప్పులు తీసుకుంటున్నాయి. ఈ అప్పులకు వడ్డీ చెల్లించలేని Income కూడా లేకుండా పోతుండాది. కట్టకడపటికి వడ్డీ చెల్లించటానికి చేతకానప్పుడు ఈ దేశమునే తాకట్టు పెట్టవలసి వస్తుంది. మన భారతదేశము కూడను అ స్థితిలోనే ఉంటున్నది. కొన్ని వేలకోట్లు Interst చెల్లిస్తున్నాది. మనపాటికి మనము మాత్రం చక్కగా నేతి బీరకాయవలె ఉంటున్నాము. నేయి అందులో ఏమాత్రము ఉండదు.

అదేరీతిగనే మన భారతదేశమనేది లక్ష్మీస్వరూపము అన్నపూర్ణ స్వరూపము అనే పేరు ఉందిగాని అన్నమునకు కరవైపోయింది. దీనికి కారణమేమంటే ఈ desires పెరిగిపోవటంచేతనే. ఎవరికి వారు నేను MBA ప్యాస్ చేశాను నేను BE ప్యాస్ చేశాను నేను MBBS ప్యాస్ చేశాను నాకు మంచి ఉద్యోగము చిక్కాలి గొప్ప సేలరీ రావాలి, ఎవరికి వారు గొప్ప salary రావాలి అనుకుంటున్నారు గాని, ఎవరికి వారు salaryని అందుకొని పోతుంటే దీనిని అభివృద్ధి పరచేవారు ఎవరు? వచ్చిన ధనమంతా వీరి salaryకి పోతుంటే

srisathyasaivachanamrutam

ఇంక దేశము యేరీతిగా అభివృద్ధి చెందుతుంది. కనుక ప్రతివ్యక్తి కూడను నేను salaryకి తగినంత పని నేను చేస్తున్నానా లేదా అనే విచారణ చేసినప్పుడే ఆ salary సార్థకమవుతుంది. జీతాన్ని అభివృద్ధి కావాలని కోరుతున్నాముగాని work అభివృద్ధి చెందాలని కోరటం లేదు. work important. అదే మన నిజమైన శక్తి. workను దృష్టిలో పెట్టుకోటమే morality. అదే purity. work and purity is real strength మనయొక్క strength work and purity.

నేను చెప్పటము చేయటము ఒకటే

విద్యార్థులారా? మీకు తెలియకుండా ఉండవచ్చు. నేను చెప్పటము చేయటము ఒక్కటే. చిన్న విషయములో మీరు యోచించుకోవచ్చు. ఒక వారము నుండి undergraduate పిల్లలు, Post graduate students, second year, third year వాళ్లు అనేక కట్టలు Postలో పంపిస్తున్నారు నాకు జాబులు. అయితే ఒక రకముగా నాకు సంతోషము ఏర్పడుతుంది. క్లాసు పిల్లలందరు ముప్పైమంది చేరి ఒక Packలో పంపటము వలన Postage తగ్గిపోతుంది. ముప్పైమంది ముప్పైకవర్లలో వేసివుంటే postage ఎక్కువైపోతుంది. అయితే వారు మరొక ఉపకారము కూడా చేస్తూ వచ్చారు. కొన్ని కవర్లుపైన మాత్రమే from అనో లేక to అనో స్వామి అనో యేదో ఒకటి పేరు వ్రాసి పంపిస్తూ వుంటారు. మిగతా కవర్లులో from ఎడ్రస్సుగాని to ఎడ్రస్సుగాని ఉండదు. నేను యేమి చేస్తున్నానో తెలుసునా లోపలనున్న matter అంతానేను తీసుకొని covers అంతా కారుణ్యానందకు collect చేయమని యిస్తాను. ఆ కవర్లు కూడను waste చేయకూడదని ఎందుకంటే ఎడ్రసు వ్రాయలేదు. ఖాళీ కవర్లుగా ఉంటున్నాయి. దీనిని ఎందుకు waste చేయాలని ఈ covers కూడను నేను ఎత్తిపెడుతుంటాను. నా పొదుపు ఈ రకముగా ఉంటుంది.

అప్పుడప్పుడు కొంతమంది letters వ్రాస్తూ ఉంటారు. మన పిల్లలు కూడను చాలామంది వ్రాస్తూ ఉంటారు. కాగితాలు మడిచి ఉంటాయి. ఒకదానిపైన మాత్రము letter వుంటుంది రెండవ దానిపైన ఖాళీగా ఉంటుంది కాగితము. ఇలాంటి ఖాళీగా వున్న దాన్ని

srisathyasaivachanamrutam

అడ్డముగా చించి ఖాళీ కాగితము నా దగ్గరపెట్టుకొని మిగతాది waste paper basketలో వేస్తూ ఉంటాను. ఈ విధముగా కొంచెం ఖాళీ కాగితాన్ని కూడను నేను వదలిపెట్టటం లేదు. దానిని కూడను పొదుపు చేస్తున్నాను. ఈ విధముగా నేను చేస్తూ ఉంటాను గాని అవసరమైతే లక్షలు కోట్లు డబ్బు ఇస్తాను. అనవసరమని తెలుస్తే ఒక నయాపైసకి కూడను నేను మొండికివేస్తాను. కారణంయేమిటి? డబ్బు ఇవ్వటానికి లొంగటం కాదు. దుర్వినియోగము చేయటము చాలా తప్పని నా ఉద్దేశ్యము. అది evil. అందుకోసమే misurse of money is evil. ఎవ్వరు కూడను ఈ విధముగా misuse చేయకూడదు. అందులో మన Institute లోపల జాగ్రత్తగా ఉండాలి. ఏ టీచర్సుకు గవర్నమెంటుగాని Central Govtగాని State Govtగాని జీతాలు ఇవ్వటం లేదు. ఏదో ఒకరిద్దరిని appoint చేసిన వారికి మూడేండ్లు ఇస్తారుగాని మూడేండ్లు అయిన తరువాత ఇవ్వరు. వారుకూడా ఇవ్వటము లేదు. అవికూడను regularగా రావటం లేదు. కానీ ప్రతి lecturerకు professorకు నేను ఇస్తున్నాను స్వయముగా. వారికి ఏవిధమైన కొరతగాని ఏవిధమైన ఇబ్బందిగాని కలిగించటము లేదు. ఈ salaries కూడను scale ప్రకారముగా చక్కగా వారికి అందిస్తున్నాము. అయితే ఈ విధముగా ఇచ్చే సమయములో దేనికి నేను లొంగను కాని కొన్ని విషయముల లోపల ఒక్క రూపాయి వ్యర్థము చేసినా కూడను నేను ఓర్చుకోను.

కొన్ని కొన్ని కాలేజీల లోపల వ్యర్థమైన paper అంతా తెప్పిస్తూ ఉంటారు. ఈ magzine ఎత్తితే అంతా అసహ్యముగా ఉంటాయి. ఇటువంటి magzines అంతా తెప్పిస్తూ ఉంటారు. ఈ పిల్లలు ముందే కోతులు మాదిరివుంటే వారికి యిలాంటి magzines ఇస్తే కొండ కోతులుగా తయారైపోతారు. కనుకనే ప్రతి చిన్న విషయాలలో కూడను నేను జాగ్రత్త వహిస్తాను. పిల్లలకు news papers వస్తున్నాయి. ఎలాంటివి వస్తున్నాయి. ఇవి సద్వినియోగము అవుతుందా లేదా అని professors దగ్గర అంతా నేను మాట్లాడుతూ వుంటాను. అయ్యా! మీకు వచ్చే news paperతో మీకు వినియోగము ఉందా మీరు చదువుతున్నారా లేదా పిల్లలు చదువుతున్నారా లేదా మీరు పిల్లలు చదవకపోతే ఆ news paper stop చేసెయ్యండి. అది ఏమైనా ఉపయోగము ఉంటే మీరు తెచ్చుకోండి. అని చెప్తూ ఉంటాను.

sri sathyasai vahanamrutam

పిల్లలకు అవసరమైనవి మీరు తప్పక చేయండి నేను వద్దనను. కాని నేను నా depart ment కదా అని ఆ papers ఈ papers తెప్పించుకొని ఇష్టము వచ్చినట్లు మీరు పోతే నేను ఓర్చుకోను. కనుక మన professors గాని లేక lecturers గాని, students గాని, vice chancellor గాని, Registrar గాని, controller గాని, యింకే విధమైన అధికారులు గాని ఎవ్వరు కూడను నయాపైసా దుర్వినియోగము చేయకూడదు. ఈ విషయము మీరు మనసులో పెట్టుకున్నప్పుడే మన సంస్థ దేదీప్యమానముగా వెలుగుతుంది. నాకు right ఉందని rightకు fight చేస్తే Responsibility ఎట్లా పోతుంది. Right, Responsibility రెండూ రెండు wheels. రెండూ రెండు wings. కానీ ఈనాడు మనము rights కి fight చేస్తున్నాముగాని responsibility zero. కనుక ప్రతి విద్యార్థి, ప్రతి profesor right and responsibility రెండు సమానముగా చూసుకొని పోవాలి. ఈ రకమైన రీతిగా మనము ఈ సంస్థను అభివృద్ధి చేసినామంటే భవిష్యత్తులో ఇది ఒక ఆదర్శమైన విద్యాసంస్థగా రూపొందుతుంది.

ఇంకా కొన్ని games అవీ ఉంటుంటాయి. కావలసిన సామగ్రి మనము తప్పక ఉపయోగించుకోవచ్చు. కానీ ఈ games అయిన తక్షణమే ఈ పదార్థములంతా నిర్లక్ష్యముగా చూస్తూ ఉంటారు. responsibility లేదు. ఎవరు ఏ స్థానమునకు తగిన responsibility వారు వహించినప్పుడే వారు యోగ్యులౌతారుగాని లేకపోతే వాడు అయోగ్యుడే. అలాంటి అయోగ్యులు studentsగాని lecturersగాని మన institue లో ఉండటానికి వీలులేదు. కనుక ప్రతి ఒక్కరు responsibility తీసుకోవాలి. నా డబ్బు అయితే నేను దుర్వినియోగము చేస్తానా అని తనకు తాను పోల్చుకోవాలి. నా పని అయితే నేను యింత అలక్ష్యము చేస్తానా తనకు తాను పోల్చుకోవాలి. ప్రతివ్యక్తి కూడాను ఇది తనదిగా భావించుకున్నప్పుడే సద్వినియోగము చేయగలడు. ఏదో ఇది సంస్థదిలే ఇది సాయిబాబాదిలే అనుకుంటే మాత్రం అది ప్రయోజనం లేదు. అది అలక్ష్యమే.

లంకలో సీత ప్రవేశించింది. రావణుడు అనేక విధములుగా రాముని దూషిస్తూ ఉన్నాడు. ఈ విధముగా దూషించటము ఆమె వినలేకపోయింది. రాక్షసునికి సరైన బుద్ధి నేర్పాలనే

srisathyasaivachanamrutam

ఉద్దేశ్యముతో ఓ రావణా! నీవు గొప్ప శక్తివంతుడవని, గొప్ప అధికారివని నీవు గొప్ప తెలివితేటలు కలవాడివి, అనేక రకములుగా భుజబలము బుద్ధిబలము వర్ణించుకుంటున్నావు. రావణుడు సామాన్యుడు కాదు. అరువది నాలుగు విద్యలు అభ్యసించినవాడు. ఇంతే కాదు గోకర్ణ గజకర్ణములనే విద్యలను నేర్చినవాడు. పక్షి భాష, మృగ భాష నేర్చినవాడు. ఇన్ని విద్యలు తెలుసుకొన్నవాడు. ఏమి ప్రయోజనము. తనను తాను తెలుసుకోలేకపోయాడు. అప్పుడు దీనిని చక్కగా జ్ఞప్తికి చేయించింది సీత. రావణా! పరస్త్రీని అపహరించటము దొంగవలె నీవు ఎత్తుకు రావటము గొప్పతనమని విశ్వసిస్తున్నావు. నీ భార్యను పరపురుషుడు అపహరించినప్పుడు యేరీతిగా భరించుకోగలవు. ఆ మాట రావణునికి కొంచెం సూటిగా నాటుకుపోయింది హృదయంలో. పరస్త్రీని అపహరించటము సులభమే నా స్త్రీనే యింకొకరు అపహరిస్తే యేరీతిగా భరించుకోగలనా, సహించుకోగలనా, శాంతిగా ఉండగలనా అని తనలో తాను విచారించుకున్నాడు. అదేవిధముగానే పరులయొక్క పని, పరులయొక్క ధనము, పరులయొక్క విషయము అనుకుంటే ఇది ప్రయోజనము కాదు. నాది యితరులు అపహరించినప్పుడు నేను యేవిధముగా బాధపడతాను అనే విషయము స్వవిషయముగా మనము భావించాలి.

పరిశుభ్రతయే దివ్యత్వము

విద్యార్థులారా! ఇది మీయొక్క ఇల్లు. టేబులు చూచినా, కుర్చీలు చూచినా యిది మీదిగానే మీరు భావించుకోవాలి. దీనిని పాడుచేయకూడదు. నా రూములో ఉన్నదానిని నేను dirtyగా పెట్టుకోకూడదు. నిజంగా నా రూము ఇంత అసహ్యముగా పెట్టుకుంటానా? ఎవరైనా మిత్రులు వచ్చి చూస్తే నాకెంత అగౌరవము. అదేవిధముగానే మీరున్న రూములు మీరు అంతపరిశుద్ధముగా పెట్టుకోవాలి. ఎవరో సామానులు అక్కడ పడవేసి dirty చేసినా చూసినవారు దానిని భద్రము చేయాలి. శుభ్రము చేయాలి. ఒక రూములో ఇరవైమంది ఉంటే ఒకరికైనా బుద్ధి వద్దా. వాడు చేస్తే నాకెందుకు వీడు చేస్తే నాకెందుకు అని ఈ విధముగా పోతే ఇది నీ ఇల్లు అని ఏవిధముగా భావించగలవు. లేకపోతే ఒక్కొక్కడు ఒక్కొక్క దినము పరిశుభ్రము చేయాలనే time table పెట్టుకోవచ్చు కదా. ఆ రూములు కూడను అశుభ్రముగా ఉంటున్నాయి. ఒకానొక సమయములో ఒక విద్యార్థికి జబ్బు చేస్తే చూడటానికి నేను వస్తే ఆ

sri sathyasai vahini vacanamrutam

రూము ఒక దిబ్బ మాదిరి వుంది. ఇది Instituteకి ఉండవలసిన లక్షణము కాదు. మనము పైతట్టు తెల్లని వస్త్రము వేసుకుంటే ప్రధానము కాదు. లోపల కూడను తెల్లదనము మనము సంపాదించుకోవాలి. మనము వాసము చేత ప్రతి వసతి గృహము కూడను పరిశుద్ధముగా ఉంచుకోవాలి. లేకపోతే మనకు అనారోగ్యము యేర్పడుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యము కనుక మన Instituteలో కేవలము చదువునందు మాత్రమేకాక games యందు మాత్రమేకాక అన్ని రంగములందు ఆదర్శమైన విద్యార్థులుగా రూపొందాలి.

ఇవన్నీ కూడను మొన్న మన Instituteలో సభ జరిగినప్పుడు చెప్పాలనుకున్నాను కాని బయట ప్రజలంతా ఉంటారు. అందువలన మన గుట్టు మనము పెట్టుకోవటము చాలా అవసరమని ఊరుకున్నాను. ఈ నాడంతా మనవారే ఉంటున్నారు కనుక చెప్పవలసి వచ్చింది. అందువలనే సంసారం గుట్టు వ్యాధి రట్టు అన్నారు పూర్వీకులు. ఇది మన సంసారము కనుక మన కుటుంబము. దీనిని గుట్టుగా పెట్టుకొని రక్షించుకోవాలనే ఉద్దేశ్యముతోనే ఆనాడు ఆడిటోరియములో ఈ విషయాలంతా చెప్పలేకపోయాను.

ఆరోగ్యమే మహాభాగ్యము అనటానికి మూడు కారణాలున్నాయి. వాత, పిత్త, శ్లేష్మాదులు. మూడు సమానముగా ఉన్నప్పుడు పవిత్రమైన ఆరోగ్యము ఏర్పడుతుంది. ఈ మూడుకూడను మన దేహములో సమంగా ఉంటుండాలి. అప్పుడు మన దేహము పరిపూర్ణమైన ఆరోగ్యముతో ఉంటుంది. ఇందులో ఏ కొంచెము తగ్గినా ఎక్కినా ఆరోగ్యము చెడిపోతుంది. కనుక ఈ మూడింటిని మనము balancedగా ఉంచుకోవాలన్నప్పుడు ఏమి చేయాలి. చక్కగా తినాలి. చక్కగా ఆడాలి. చక్కగా చదవాలి. ఈ మూడింటియందే ఇవి పూర్తిగా ఒక balanceకు వస్తాయి. కేవలం ఊరికే గొంతు వరకు తినేస్తే ఆరోగ్యము పాడైపోతుంది. తిని కేవలం కూర్చోకూడదు. తిన్నదానికి తగినట్లుగా రెండింతలు work చేయాలి. అప్పుడే ఆహారము జీర్ణమవుతుంది. ఆ జీర్ణశక్తి పూర్తిగా ఉన్నప్పుడే ఆరోగ్యం ఏర్పడుతుంది. కనుక లక్షణముగా తినండి, తినటానికి నేను వద్దనను. కాని తిని ఊరికే గుండ్రాయివలె కూర్చోకూడదు. తినిన దానికి తగినట్లుగా మనము కొంత పని చేయాలి. కనుకనే work is worship అన్నారు. మన పనిని మనం చక్కగా చేసుకోవాలి. మన ఇల్లును శుభ్రము చేసుకోవాలి. మన bath

srisathyasaivachanamrutam

roomలు clean చేసుకోవాలి. మన దుస్తులు clean చేసుకోవాలి. మన పుస్తకాలు cleanగా పెట్టుకోవాలి. మన సర్వసామగ్రిని నిత్యము ఉపయోగించే ప్రతీ పదార్థము కూడను పరిశుద్ధముగా ఉంచుకోవాలి.

విద్యార్థులారా! మీకు తెలియకుండా ఉండవచ్చును. నా జీవితములో అనగా యీ శరీరము యొక్క విషయములో ఒక చిన్న ఉదాహరణ చెప్తాను. ఇది 8th standard చదువుతూ ఉండింది. అప్పుడే పెద్ద పెద్ద books అంతా ఇచ్చేవారు. అది భూగోళము అని ఒక బుక్ ఇచ్చారు. అది భూగోళమంత పెద్దగా ఉంది. అది తల క్రింద పెట్టుకుంటే నిద్రవచ్చేది. అది పెద్ద దిండు మాదిరి ఉండేది. ఇంకోటి civics book. ఆ సివిక్సు కూడను అంత పెద్దదిగా ఉండేది. ఇలాంటి పుస్తకాలంతా తేస్తే ఒక్కొక్క పుస్తకము ఇంత పెద్దదైనా వాని వెల ఒక రూపాయి అర్ధరూపాయి. ఈనాడు చపాతి అంత మందముతో వున్న book యిరవై రూపాయలు. విలువలు ఇంత ఎక్కువైపోయాయి. ఆనాడు 10th standard books అన్నీ ఇంత పెద్ద bagకు అయ్యేటువంటివి. ఇవన్నీ చేరి పదకొండు రూపాయలు. నేను ఏవిధముగా ఉపయోగపెట్టేవాడినంటే అంత పరిశుద్ధముగా పెట్టేవాడిని. ఈనాటి పిల్లలు అట్టలు పై నుండి క్రింది వరకు యేమేమో పేర్లు వ్రాసి ఉంటారు. మధ్య కాగితాలలో కూడను underline చేసి ఉంటారు. underline లోపల చేసుకోవాలి గాని bookలో కాదు. కాని అన్నీ నేను చదివేవాడిని. కొన్ని కొన్ని చోట్ల రెండు కాగితాలు కరచుకొని ఉండేవి. చించితే కాగితములో ముక్కల్లోపల ఏదైనా పోతుందేమోనని దానిని అట్లే పెట్టి చదివేవాడిని. సంవత్సరమైన తరువాత నాకు 1st class వచ్చేసింది. ఆనాడు ప్రతి subject కూడను (ఏదో మీకు అతిశయోక్తిగా చెప్తున్నానని కాదు) answer paper మాకే ఇచ్చేవారు కనుక ఆ టీచర్సు అంతా పై నుండి క్రింది వరకు very very... good అని వ్రాసేవారు. నా పేపరకు ఆ రకంగా వ్రాసి పంపేవారు టీచర్లు. pass అయ్యాను.

చిన్ననాటి నా మిత్రులతో......

నా యొక్క deskలో ముగ్గురు కూర్చునేవారము. నేను సెంటరులో ఇటువైపు అటువైపు ఒక్కొక్క పిల్లవాడు. నేను ఎంత క్లవరో వాళ్లు అంత డల్. నాకు యెంత మార్కులో వాళ్లకు

అంత జీరోలు. ఒకనాడు ESSLC examination ప్రారంభమైంది. అప్పుడు కాగితము పెన్ను కూడను మేము తీసుకుపోకూడదు. ఒక తలుపు దగ్గర ఒక టీచరు నిల్చుకొని మా చేతులన్నీ చూసేవారు. కొంతమంది చేతుల్లో వ్రాసుకొని ఉంటారు. కాళ్లపైన వ్రాసుకొని ఉంటారు. అన్నీ checkup చేసి లోపలకు పంపేవారు. Empty చేతులతో లోపలకు పోవాలి. heavy headsతో లోపలకు పోవాలి empty headతో బయటకు రావాలి. పిల్లలు చాలా బాధపడ్డారు. నా ప్రక్కన కూర్చున్న పిల్లలు. class testలో నేను వారికి సాయం చేసేవాడిని ఇద్దరికీ. కాని ఈ examsలో ఏ రీతిగా సాయం చేయటం. నా నెంబరు వేరు వారి నెంబరు వేరు. ఎక్కడ ఎక్కడో కూర్చుని ఉంటారు. నేను వారికి చక్కని plan ఇచ్చాను. వాళ్ళకు స్వామి అంటే ప్రాణ సమానం. ఆ చిన్న వయస్సులో వారి అదృష్టం అది. ఎప్పుడు చూసినా రాజు రాజు రాజు. వారింటిలో పకోడాలు చేస్తే నాకు రెండు పకోడాపొట్లంలో కట్టుకొని తెచ్చేవారు పాపం. అదియే జన్మాంతర సంస్కారమో వారిది. ఆ విధమైన attachment, ఆ attachment ఉండటం వలనే వారికి help చేయక తప్పదు. నీవే తప్ప ఇతః పరంబెరుగ అనేవారికి ఏమైనా నేను చేస్తాను. చెప్పాను వారికి, ఏదో ఒక ట్రిక్ చేశాను నేను. ఆ రకంగా మీరు చేయండి అంతా అయిపోతారన్నాను. Examination hallలో కూర్చున్నాము. నాకు question paper ఇచ్చారు. ఇంక అక్కడ టీచర్లు తిరుగుతూ చూస్తూ ఉన్నారు. 2 hours time ఇస్తారు నేను half an hourలో నాది వ్రాశాను. ఇంకొక half an hourలో మా friendది వాడి hand writing లాగా నేనే వ్రాశాను. దానిపైన వాని నెంబరు వేశాను. ఇంకో విద్యార్థి hand writing లాగా యింకో అర్ధగంటలో వాని పేపరు వ్రాశాను. వాని నంబరు, పేరు వ్రాశాను. నా దానిపైన నా number నా పేరు వ్రాసుకున్నాను. బెల్లు కొట్టటం కోసం కూర్చున్నాను ఇంకా అర్ధగంట కాచుకోవాలి కదా. వాళ్లు కూడా ఏమో వ్రాసుకుంటున్నట్లుగా వ్రాసుకుంటున్నారు. అంతే ఏమీ చేయలేదు. బెల్లు కొట్టారు. ఇంక టీచర్లు అంతా వచ్చి papers papers అంటున్నారు. ఈ గలాటాలో ఈ మూడు తీసుకువెళ్లి నేనే పెట్టేశాను. ఈ మూడు పేపర్లు నేనే పెట్టాను. రిజల్టు వచ్చింది. 15 days అయిన తరువాత, మా ముగ్గురిది 1st Class. కాని వీరు కాపీ కొట్టారా అనటానికి ఒక్కొక్కరిది ఒక్కో నంబరు, ఒక్కొక్కరిది ఒకో చోటు ఎట్లా కాపీ కొట్టారు? పోనీ ఎవరైనా వ్రాసిపెట్టారా

అంటే వాని hand writing వానికి ఉంది. వచ్చారు పాపం. రాజూ మా ప్రాణాలు నిలబెట్టావని కాళ్లు పట్టుకున్నారు పాపం.

మా క్లాసులో ఒక హరిజన బాలుడు ఉండేవాడు, అప్పుడు కూడా నాకేమీ భేదము లేదు. ఈ cast, religion, colour అనేది ఏనాటి నుండో లేదు. అతను వచ్చాడు. రాజూ నేను చాలా బీదవాడిని నాకు నీ books ఇవ్వవా? ఆనాడు సంవత్సరం సంవత్సరం సిలబస్ మారేది కాదు. ఐదు సంవత్సరముల వరకు ఒకటిగానే ఉండేది. same books. అది నేను చెప్పాను. Books ముందు చూడు. నీకే విధముగా నచ్చుతే ఆ విధముగా చేయవచ్చు అన్నాను చూచాడు. ఒక్క పేపరు కూడా నలగలేదు. కొత్త books మాదిరి ఉన్నాయి. అప్పుడతను అన్నాడు. ఇవి కొత్త books మాదిరి ఉన్నాయి. నాకు అంత శక్తి లేదు. రాజూ! నేను 20 రూపాయలు ఇస్తానన్నాడు. నేను చెప్పాను friend నాకు కావలసింది. పుష్పగిరి తిరునాళ్ళకి పోతున్నాను. అక్కడ నేను స్కౌటుగా పనిచేయాలి. నాకు పది దినములకు ఐదురూపాయలు చాలు. ఒక అణా యిస్తే ప్రొద్దున్న నాలుగు దోశలు, మధ్యాహ్నం నాలుగు దోశలు, రాత్రికొక నాలుగు దోశలు వస్తాయి. ఈనాడు ఐదు రూపాయలిస్తే ఒక దోశ రాదు. నేను చెప్పాను. నాకు కావలసినది ఐదురూపాయలే. నీ ఇరవైరూపాయలు నాకు అక్కరలేదు. ఐదురూపాయలు నాకు ఇచ్చి నీవు ఈ books తీసుకువెళ్ళు అన్నాను. తాను కొండంత ఆనందమును అనుభవించాడు. నిజముగా నేను ఈ books కొనాలంటే నేను యెంతో అప్పు చేయవలసి వచ్చేది. కనుక రాజు నాపైన దయతో చాలా చీప్‌గా ఇచ్చావు అని ఆనందముగా వెళ్ళాడు.

కనుక విద్యార్థులారా! ఆశకు ఒక అదుపు ఉండాలని మీకు ఈ కథ చెపుతున్నాను. ఆనాడు రూపాయినోట్లు, రెండు రూపాయినోట్లు ఏమీ ఉండేవి కావు. ఈ ఐదు రూపాయలు కూడను దమ్మిడీలు, అణాలు ఇంత మూటగా పట్టుకొచ్చాడు. నాకు సంవత్సరమంతా చేరి రెండు షర్టులు, రెండు నిక్కర్లు మాత్రమే. నేను ప్రతి క్లాసులో 1st వస్తున్నాని fail అయిన వాళ్లకు నాపైన ద్వేషము. వాళ్లు బుక్కపట్నం నుండి పుట్టపర్తికి ఎట్లో నా కాళ్లు పట్టుకొని ఈడ్చుకొని వచ్చేవారు. మేము తప్పు చేస్తే నీవు కూడా తప్పు చెప్పాలి. రైటు చెప్పకూడదని వాళ్ల

srisathyasaivachanamrutam

మొండితనము. టీచరు question వేస్తే మేము తప్పు చెప్తే నీవు కూడా తప్పే చెప్పాలి. నాకు రెండు విధములైన బాధలక్కడ. తప్పు చెప్తే టీచరు కొడతాడు, రైటు చెపుతే పిల్లలు కొడతారు. పిల్లలతో దెబ్బలు తిన్నా రైటే చెప్పాలని నా ఉద్దేశ్యము. సత్యానికి ఎంత బాధలెదురైనా ఫరవాలేదు. ఈ విధమైన సత్యమార్గము అనుసరించి చెప్తువచ్చాను. అంత పెద్దమూట తెస్తే నేను ఎక్కడ పెట్టుకొనేది. నాకు వేరే పెట్టే లేదు. వేరే వస్త్రాలు లేవు. సాక్షాత్తు జరిగింది చెపుతున్నాను. నాకు పాతది ఒక నిక్కరు ఉంది. నేను దానిని చించి దానిలో ఈ డబ్బులన్నీ మూట కడదామని గట్టిగా లాగాను. అది పాతది కనుక పిగిలిపోయి చినిగిపోయింది. నేను యింకొకరి ఇంటిలో ఉండి చదువుకుంటున్నాను, ఇక్కడ 10th Class వరకు స్కూలులో లేదు. ఇది చిరిగిపోయి డబ్బులన్ని క్రిందపడగానే ఆ యింటి వారొచ్చి ఆ దొంగతనం చేశావా ఈ డబ్బులంతా అని పట్టుకొని కొట్టారు, ఆ డబ్బు కూడా వారు తీసుకున్నారు. ఇంక నేను రేపటి దినము వస్తానని చెప్పాను. ఎట్లాపోయేది నేను.

ఈ పుష్పగిరి తొమ్మిదిమైళ్లు ఉంటుంది. చెప్పిన మాటను దక్కించుకోవాలనే ఉద్దేశ్యముతో early morning 4గంటలకు బయలుదేరాను. వెన్నెలగా వుంది. తొమ్మిదిమైళ్ళు నడచుకొనిపోయాను. అందరికి తెలుసు. ఇప్పుడే ఇంత ఎత్తుఉన్నాను. తొమ్మిదేండ్లప్పుడు ఇంత ఎత్తే ఉన్నాను. నా క్లాసులో నేను కూర్చుంటే మహబూబ్‌ఖాన్ వాళ్లందరు డెస్క్‌పైన కూర్చుంటే నన్ను desk పైన కూర్చోమనేవాడు. ఎందుకంటే కనబడను. నన్ను చూడాలి అతను. అది ఏదో జన్మాంతర సంస్కారము. నన్ను చూస్తేగాని అతను పాఠము చెప్పలేదు. నడచుకుపోయాను. అప్పటికే ఈ బస్సులో పోయినవారంతా చేరుకున్నారు. నా దగ్గర డబ్బులేదు. వారితో చేరితే Canteen దగ్గర డబ్బుకట్టాలి. బస్సుకి డబ్బుకట్టాలి. నా దగ్గర ఎక్కడి నుండి వస్తుంది. కాబట్టి వారితో చేరలేదు. అది కడపజిల్లా నీరుకు చాలా కష్టం. నడచి నడచి దాహమైంది. నీరు కూడా లేదు. తెల్లవారి లేచాను, నీరు త్రాగుదామని పోతే నీరు ఎక్కడా లేదు. కొన్ని చోట్ల పశువులనంతా కడగటానికి ఒక గుంటలో నీరుఉంది. అక్కడికి వెళ్లాను. అక్కడ ఎవరూ కన్పించలేదు. ఆ నీరు త్రాగేశాను. త్రాగి వెనుకకు వస్తూ ఉంటే ఒక రాయిపైన బీడీలకట్ట ఒక అణావున్నాయి. ఎవరో పశువుల కాపరి విడచిపెట్టిపోయాడు. ఈ బీడీలు, సిగరెట్టు తాగటం అంటే నాకెప్పుడూ ఇష్టం లేదు. అందువల్ల ఆ బీడీలు ముక్కలు చేసి ఇసుకలో కూర్చి అణా

తీసుకొని వచ్చేశాను. ఎవరైనా కనిపిస్తే వారిదేమోనని అడుగుదామని చూశాను. ఆ కాలములో బజారులో బుడబుడకాటా ఆట అని ఆడేవారు. ఆఠీను, కళావరు, ఇస్పేటు ఇలా కలిపి పెట్టేవారు. దీనిపైని మనం బొట్లు పెడితే ఎన్ని వస్తే అన్ని వచ్చేవి. దానిని గాంబ్లింగు అంటారు. నాకు పది దినాలకి పన్నెండు అణాలు చాలు. అణాకు నాలుగు బొట్లు. ఒకోదానిపైన అంతపెడుతూ ఆడుతూ వచ్చాను. double double వచ్చేసింది. ఒక స్నేహితుడు చూశాడు. నీకు దండిగా వస్తుంది ఆడు ఆడు అన్నాడు. పన్నెండణాలు వచ్చేంతవరకు మాత్రం నేను ఆడాను. ఆ తరువాత నేను ఆడనని చెప్పాను. నాకెంత కావాలో అంత వచ్చింది. చాలు అని చెప్పాను. సీలింగ్ ఆన్ డిజైర్సు. నాకు అవసరమైనంత చాలు. వస్తుంది కదా అని అధికముగాపోతే చాలా ప్రమాదము. కనుక ప్రతి ఒక్క విషయమునందు కూడను ఆనాటి నుండి ఇనాటి వరకు ఎంతనో అంత. దానికి తగినంతనే వస్తూఉంటుంది. ఈ విద్యార్థులందరు కూడా ఈ క్రమశిక్షణ, పొదుపుతనము, సత్యవాక్కు ఉంటే జగమంతా కళకళలాడుతూ కల కల నవ్వుతుంది.

భగవంతునిపై విశ్వాసం వదలకండి

విద్యార్థులారా! ఇలాంటి చరిత్రలు స్వామి విషయములో వందలకు వందలు వేలకు వేలు ఉంటున్నాయి. Ideal lifeగా ఉంటుండాలి. ఎవరన్నా ఏమన్నా ఏమాత్రము జవాబు ఇవ్వకూడదు. ఆ విధమైన జీవితాన్ని గడిపినప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారిపోతుంది. ఈనాటి వరకు, ఇప్పటికి 63 సంవత్సరములు అయిన్పటికి ఒకరివద్ద ఒక్క వస్తువు నేను అడగలేదు. ఏ ఒక్క విషయంగాని ప్రాపంచికంగా పారమార్థికంగాగాని నేను అడగటం లేదు. మనసు మంచిగా వుంటే మనిషి పరుగెత్తి వస్తాడు. ఈనాటి మానవుడు ఈ త్యాగములో ఏమాత్రం కూడను ప్రవేశించలేదు. ఎలా ఉంటుంది త్యాగము. ఒక్క ఐదు నిముషములు కాఫీ కప్పు లేటు అయిందంటే ఉగ్రుడైపోతాడు. ఈనాటి మానవుడు ఒక సిగరెట్టు ఐదు నిముషములు లేటుగా త్రాగాడంటే వాడు పిచ్చివాడుగా మారిపోతాడు. ఇలాంటివాడు ఇంద్రియ నిగ్రహము ఏరీతిగా చేయగలడు. కనుక మొట్టమొదట మనము slave కాకూడదు. master కావాలి. మన sensesకు అంతా మనము master కావాలి. వాడే నిజమైన మానవుడు. ఏ చిన్న విషయానికిగాని, ఒక తలంపుకుగాని కేవలం slave మాదిరి పరుగెత్తిపోతూ ఉంటే యిది

srisathyasaivachanamrutam

కేవలం మానవాకారములో వున్న రాక్షసత్వంగా మారుతుంది.

విద్యార్థులారా! మీరు సత్యాన్ని పలకండి. సత్యానికి సర్వము త్యాగము చేయండి. ఆడిన మాటలు తప్పకండి, యోచించి మాటఇవ్వండి. మాట ఇచ్చి తప్పితిరా ఇంక జీవితమే ఉండదు. జరిగిన దానికి పాశ్చాత్తాప పడండి. Ideal lifeని మీరు అనుభవించండి. దేశానికంతా మీరు ఒక విధమైన Ideal lifeను అందించండి. ఇది మీ అదృష్టవశాత్తు ఇలాంటి అవకాశము లభించింది. ప్రపంచములో ఎంతమంది లేరు. ఇక్కడ ఇంతమందే రావటానికి ఎంత అదృష్టవంతులోయేమో? మీ అదృష్టాన్ని నిల్పుకొండి. స్వామి అనుగ్రహానికి పాత్రులు కండి. తల్లితండ్రులను సంతోష పెట్టండి. ఈ విశాల భారతదేశానికి సరియైన నాయకులుగా మీరు తయారుకండి. ఖర్చులు తగ్గించుకోండి. ఆశలు విరమించుకోండి. ఉండవలసిన స్థాయిలో మీరుండి గౌరవమును నిలుపుకోండి. ఇదే విద్యల లోపల సారమైన విద్య. భగవంతునిపై విశ్వాసము మాత్రము వదలకండి. ఆ విశ్వాసమే మీ శ్వాసగా భావించండి. నిరంతరము భగవంతుని చింతించండి. తప్పక మీకు చిత్తశుద్ధి ఏర్పడుతుంది.

(తేది. 19-01-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)

sri sathyasai vachanamrutam